సాక్షి అనకాపల్లి

గురువారం । 7 । నవంబర్ । 2024



విద్యార్థినులతో వెట్టిచాకిరీ

యలమంచిలి హైస్కూల్లో విద్యార్థినులతో స్కూల్‌ను శుభ్రం చేయిస్తున్నారు. రోజుకు ఐదుగురికి ఈ డ్యూటీ వేస్తున్నారు. 8లో



విద్యార్థుల ఆందోళన 8లో

విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని విద్యార్థులు అనకాపల్లిలో ఆందోళన చేశారు.

డీఈవో బాధ్యతల స్వీకారం



అనకాపల్లి: జిల్లా విద్యాశాఖ అధికారిగా గిడ్డి అప్పారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎం.వెంకటలక్ష్మమ్మ విజయవాడ విద్యాశాఖ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

న్యూస్‌రీల్

గంజాయి కారు బీభత్సం!



అనుమానిత కారును పొక్లెయిన్ సహాయంతో పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న ఎస్‌ఐ మల్లేశ్వరరావు

దేవరాపల్లి: ఏజెన్సీ ప్రాంతం నుంచి వస్తున్న కారు బుధవారం రాత్రి దేవరాపల్లిలో బీభత్సం సృష్టించింది. శ్రీరాంపురం వై జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద అల్లూరి జిల్లా వైపు నుంచి దేవరాపల్లి వైపు వస్తున్న అనుమానిత కారును ఆపేందుకు సిబ్బంది ప్రయత్నించారు. మెరుపు వేగంతో వచ్చిన కారు ఆపకుండా అక్కడి స్టాపర్లను గుద్దుకుంటూ దూసుకుపోయింది. త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న చెక్ పోస్టు సిబ్బంది వెంటనే తేరుకొని కారును వెంబడించారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు, తన సిబ్బందితో కలిసి నాలుగు రోడ్ల జంక్షన్‌లో రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్‌ను పెట్టించారు. కారు టైరు పంక్చర్ కావడంతోపాటు పోలీసులు రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్ పెట్టిన విషయాన్ని గమనించిన సదరు వ్యక్తులు టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న డ్రైనేజీలో కారును దించేశారు. కారును అక్కడే విడిచి పెట్టి పరారయ్యారు. పొక్లెయిన్ సహాయంతో కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన కారులో గంజాయి ఉన్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే సదరు కారులో గంజాయి ఉందా, ఉంటే ఎంత మేర ఉంది, కారులో ఎంతమంది వ్యక్తులు ఉన్నారు, ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నారు.. తదితర విషయాలను పోలీసులు ధ్రువీకరించాల్సి ఉంది. ఈ విషయమై ఎస్‌ఐను వివరణగా కోరగా పోలీస్ చెక్ పోస్టు వద్ద స్టాపర్లను గుద్దుకుంటూ కారు దేవరాపల్లి వైపు దూసుకురావడం వాస్తవమేనని, నాలుగు రోడ్ల కూడలిలో ట్రాక్టర్ అడ్డంగా పెట్టడంతో కారును విడిచిపెట్టి అందులో వ్యక్తులు పరారైనట్లు తెలిపారు.

జడ్జీలకు రెవెన్యూ రికార్డులపై అవగాహన



జడ్జీలకు రెవెన్యూ రికార్డుల గురించి వివరిస్తున్న తహసీల్దార్ ఆనందరావు

పద్మనాభం: రెడ్డిపల్లి సచివాలయంలో ఆరుగురు జడ్జీలకు రెవెన్యూ రికార్డులపై తహసీల్దార్ కె.ఆనందరావు బుధవారం అవగాహన కల్పించారు. యలమంచిలి జూనియర్ డివిజన్ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి పి.స్వాతి భవాని, యలమంచిలి జూనియర్ డివిజన్ అడిషనల్ సివిల్ జడ్జి టి.వీర రాఘవేంద్రరావు, నర్సీపట్నం జూనియర్ డివిజన్ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి ఎస్.మధుసూదనరావు, నర్సీపట్నం జూనియర్ డివిజన్ అడిషనల్ సివిల్ జడ్జి ఎం.రోహిత్‌లకు అవగాహన కల్పించారు.



మాజీ ఎమ్మెల్యే గణేష్ మెడపై చేయి వేసి గెంటుతున్న పోలీసులు



అడ్డుకున్న పోలీసులను నిలదీస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్



పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి

నిలదీస్తే నిర్బంధమా?

- గబ్బాడ ఇసుక డిపో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టీడీపీ నేతలు
- వారితో అంటకాగుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసుల బనాయింపు
- సీఐ రేవతమ్మ వైఖరిపై మాజీ ఎమ్మెల్యే గణేష్ నిరసన గళం
- శాంతియుత ధర్నాకు వెళుతుండగా ఆయనతోపాటు 72 మంది పార్టీ శ్రేణుల అరెస్ట్

ఇసుక దొంగలతో అనుబంధం.. ప్రశ్నించిన గొంతులపై నిర్బంధం.. ఇదీ నర్సీపట్నంలో పోలీసు నీతి. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడి సొంత నియోజకవర్గం నర్సీపట్నంలోనే ప్రజాస్వామ్యానికి పోలీసులు తూట్లు పొడిచారు. టీడీపీ నేతల ఇసుక దోపిడీని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నేతలపైనే కేసులు పెట్టి, అధికార పక్షానికి కొమ్ముకాశారు. దీనికి వ్యతిరేకంగా శాంతియుతంగా ధర్నాకు దిగిన మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను, పార్టీ నాయకులను **అరెస్టు చేసి తమ దమననీతిని చాటుకున్నారు.**



వైఎస్సార్‌సీపీ శ్రేణులను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

సాక్షి, అనకాపల్లి/నర్సీపట్నం:

ప్రభుత్వ ఆదాయానికి **గండి కొడుతూ** గబ్బాడ ఇసుక డిపో నుంచి నాలుగు నెలలుగా టిప్పర్లతో అక్రమంగా ఇసుక తరలిస్తున్న అయ్యన్నపాత్రుడి అనుచరులు, టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారిపై చర్యలు తీసుకోకపోగా..తిరిగి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపైనే రూరల్ సీఐ రేవతమ్మ కేసులు నమోదు చేశారు. అధికార పార్టీ నేతలకు కొమ్ము కాస్తున్న సీఐ వైఖరికి నిరసనగా బుధవారం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శాంతియుత ధర్నా తలపెట్టారు. బుధవారం ఉదయం వారు స్టేషన్‌కు బయలుదేరేటప్పటికే గురుకుల పాఠశాల మెయిన్ రోడ్డుపై పోలీసులు మోహరించారు. పార్టీ నాయకులతో వస్తున్న మాజీ ఎమ్మెల్యేను మార్గం మధ్యలోనే అడ్డుకోవడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. సీఐ టీడీపీ కార్యకర్తలా పనిచేస్తున్నారని, సీఐ పెట్టిన తప్పుడు కేసులపై నిరసన తెలిపే హక్కు లేదా అని గణేష్ పోలీసులను ప్రశ్నించారు. అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో సీఐ ఇలా చేస్తున్నారని, రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని పోలీసులను హెచ్చరించారు. టౌన్ సీఐ గోవిందరావు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సీఐలు అప్పన్న, అశోక్‌లకు మాజీ ఎమ్మెల్యేకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మాజీ ఎమ్మెల్యేతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, పార్టీ ఎస్సీ సెల్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, నాయకులను అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను కశింకోట పోలీసు స్టేషన్‌కు, మిగిలిన నాయకులను కోటవురట్ల, రోలుగుంట పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేతల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు.



నర్సీపట్నంలో మోహరించిన పోలీసులు

72మంది వైఎస్సార్‌సీపీ శ్రేణుల అరెస్ట్

ఈ ఘటనకు సంబంధించి నర్సీపట్నంలో 32మందిని, మాకవరపాలెంలో 40 మందిని మొత్తం 72 మందిని అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను కశింకోట పోలీస్‌స్టేషన్‌కు, మిగతా నేతలు, కార్యకర్తలను కోటవురట్ల, రోలుగుంట పోలీస్ స్టేషన్లకు తరలించారు. సాయంత్రం 6 గంటల వరకు స్టేషన్‌లో ఉంచి విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే గణేష్ ధర్నాకు సంఘీభావంగా గొలుగొండ, నాతవరం తదితర ప్రాంతాల నుంచి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పోలీసులు ఆయా ప్రాంతాల్లో అడ్డుకున్నారు. మాకవరపాలెంలో 40 మంది వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో పార్టీ సీనియర్ నేత రుత్తల యర్రాపాత్రుడు తదితరులు ఉన్నారు.

పోలీసుల ఓవరాక్షన్..

నర్సీపట్నంలో బుధవారం తెల్లవారుజాము నుంచే పోలీసుల ఓవరాక్షన్ మొదలయింది. వైఎస్సార్‌సీపీ తలపెట్టిన ఆందోళనను భగ్నం చేసేందుకు ఎక్కడికక్కడ నాయకులు, కార్యకర్తలను నిర్బంధించినప్పటికీ, వివిధ మార్గాల్లో వందల మంది నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే గణేష్ ఇంటికి చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ ధర్నా నేపథ్యంలో పోలీస్ యాక్ట్-30ను అమల్లోకి తెచ్చారు. మంగళవారం రాత్రి నుంచి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ధర్నాను భగ్నం చేసేందుకు పోలీసులు ఎక్కడికక్కడ పోలీస్ పికెట్ పెట్టినా పలు దారుల్లో మాజీ ఎమ్మెల్యే ఇంటికి చేరుకుని అరెస్ట్ చేశారు.

గొంతు నొక్కితే సహించం

- తప్పుడు కేసులకు భయపడం
- సీఐ రేవతమ్మపై చర్యలు తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ డిమాండ్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: టీడీపీ నాయకులకు తొత్తులా వ్యవహరిస్తున్న నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ డిమాండ్ చేశారు. స్పీకర్ సిహెచ్. అయ్యన్నపాత్రుడి ఆదేశాల మేరకు సీఐ తమ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. సీఐ వైఖరిని నిరసిస్తూ పోలీసు స్టేషన్ ముందు ధర్నా చేసేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకోవటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఐ వైఖరిని ఉన్నతాధికారులకు తెలియజేసేందుకు పోలీసు స్టేషన్ ముందు శాంతియుత ధర్నా తలపెట్టామన్నారు. నిరసన వ్యక్తం చేసేందుకు అవకాశం ఇవ్వకపోవడం దారుణమని పోలీసులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయేది తమ ప్రభుత్వమే ఖబడ్దార్ అంటూ పోలీసులను హెచ్చరించారు. ఇసుక దొంగలకు కొమ్ము కాసి ఇసుక అక్రమ రవాణాను వెలుగులోకి తెచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. సీఐ టీడీపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గబ్బాడ ఇసుక డిపోలో అక్రమాలు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేస్తే, ఫిర్యాదు చేసిన నాయకులపై ఎలా కేసులు పెడతారని ప్రశ్నించారు.

ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసేందుకు పార్టీ నాయకులతో తాను స్టేషన్‌కు వెళ్తే సీఐ టీడీపీ కార్యకర్తలా మాట్లాడారని ఆరోపించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడి ఆదేశాలతో సీఐ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సీఐ రేవతమ్మ వ్యవహారశైలికి నిరసనగానే తాము పోలీసు స్టేషన్ ముందు ధర్నా చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. టీడీపీ నాయకులు, సీఐ ఏకమై పెట్టే తప్పుడు కేసులకు భయపడేదిలేదన్నారు.

కశింకోట స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే గణేష్

కశింకోట: నర్సీపట్నంలో అరెస్టు చేసిన మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌తో పాటు నలుగుర్ని కశింకోట పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. బుధవారం సాయంత్రం 5.20 గంటల ప్రాంతంలో విడిపెట్టారు. వీరిని నర్సీపట్నంలో ఉంచితే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని భావించిన పోలీసు అధికారులు అరెస్టు చేసిన వారిని జిల్లాలోని వేర్వేరు పోలీసు స్టేషన్లకు తరలించారు. దీనిలో భాగంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ సహా నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిలర్, పార్టీ లీగల్ ఎడ్వయిజర్ మాకిరెడ్డి బుల్లిదొర, నర్సీపట్నం పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎకా శివ, యువజన విభాగం నాయకుడు చింతకాయల వరుణ్‌లను కశింకోట పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఉదయం 11.30 గంటల నుంచి ఇక్కడ పోలీసుల అదుపులో వారు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పోలీసు స్టేషన్‌కు వచ్చి మాజీ ఎమ్మెల్యేకు సంఘీభావం తెలిపారు.



కశింకోట స్టేషన్‌లో నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను కలిసి సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు

చేయి తిరిగిన చోర శిఖామణులు

- ఐదు కేసుల్లో ముగ్గురు నిందితుల అరెస్ట్
- రూ.2.31 లక్షల సొత్తు స్వాధీనం
- వివరాలను వెల్లడించిన ఎస్పీ తుహిన్ సిన్హా



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఐదు చోరీ కేసుల్లో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.2.31 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. తన కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. పాయకరావుపేట పీఎస్‌లో నమోదైన నాలుగు కేసుల్లో 8 గ్రాముల బంగారం, 2.12 కేజీల వెండి, 2 కేజీల ఇత్తడి, 15 జతల బట్టలు, ఒక హోం థియేటర్, 2 టీవీలు, 1,240 కేజీల బరువు తూచే ఇనుప గుళ్ళు స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పరవాడ పోలీస్ స్టేషన్ చోరీ కేసులో 2 తులాల బంగారు పుస్తెల తాడు, ఒక బంగారం ఉంగరం, ఒక జత వెండి పట్టీలు (10 తులాలు), ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్ట్ చేశారు.

48 కేసుల్లో నిందితుడు

ఏ 1 నిందితుడు మరదల్ని ఏ 2 ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. మైనర్ బాలికను ప్రేమించాడని బాలిక తల్లిదండ్రులు ఏ 2పై పోక్సో కేసు నమోదు చేశారు. ఈకేసు పీఎం పాలెం పోలీస్‌స్టేషన్‌లో నమోదైంది. ఈ కేసులో సెటిల్‌మెంట్ చేసుకోవడానికి కొంత డబ్బులు ఏ 2ను అడిగారు. ఆ డబ్బు కట్టడానికి ఏ 1తో కలిసి ఏ 2 దొంగతనానికి పాల్పడ్డాడు. పాయకరావుపేట పోలీస్‌స్టేషన్లో నాలుగు చోరీలకు పాల్పడ్డారు. ఏ 1 నిందితుడు పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు బాలాజీనగర్‌కు చెందినవాడు కాగా.. ఏ 2 అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలంలో గేలం వీధికు చెందినవాడు. ఏ 1పై విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 48 చోరీ కేసులున్నాయి. ఏ1 గతంలో 20 కేసుల్లో శిక్ష అనుభవించాడు. ఏ2పై ఇప్పటివరకు నాలుగు కేసులు నమోదయ్యాయి. వీరిని బుధవారం ఉదయం పాయకరావుపేట ఆర్టీసీ కాంప్లెక్స్, వాటర్ ట్యాంక్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన చోరీ కేసుల్లో పట్టుబడిన నిందితుడు అనకాపల్లి జిల్లా మారేడుపూడి పంచాయతీ గొన్నువానిపాలెం గ్రామానికి చెందినవాడు. నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా పాయకరావుపేట సీఐ అప్పన్న, సీసీఎస్ సీఐ అప్పలనాయుడు, పరవాడ సీఐ మల్లికార్జునరావు, సీసీఎస్ సిబ్బంది, క్లూస్ టీం, ఐటీ కోర్ సిబ్బందిని అభినందించారు.

బాబు పాపాలే శాపాలవుతాయి

- వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు
- సుప్రీంకోర్టు తీర్పుకు భిన్నంగా రెండు రోజుల్లో 100 మందిని అరెస్టు
- అధికారం శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తు పెట్టుకోవాలి
- ప్రణాళికా ప్రకారం కాపులను, పవన్ కల్యాణ్‌ను అణగదొక్కుతున్నారు
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి



రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు

విశాఖ సిటీ: 'సుప్రీం కోర్టు తీర్పునకు భిన్నంగా రెండు రోజుల్లో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేశారు. వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారు. చంద్రబాబు, లోకేష్ చేసే ఈ తప్పులకు పదింతలు అనుభవిస్తారు. బాబు చేసే పాపాలు నాగుపాములా లోకేష్ మెడకు చుట్టుకుంటాయి. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని చంద్రబాబు గుర్తుంచుకోవాలి' అని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి హెచ్చరించారు. బుధవారం విశాఖ వచ్చిన ఆయనకు విమానాశ్రయంలో వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ముఖ్యనేతలు బొడ్డేడ ప్రసాద్, చెంగల వెంకట్రావు తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..

2027లో మళ్లీ అధికారంలోకి వస్తాం..

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్న కారణంగా ఎవరినీ అరెస్టు చేయకూడదని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి. అందుకు భిన్నంగా పోలీసులు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. రెండు రోజుల్లోనే 100 మందిపై కేసులు నమోదు చేశారు. దీన్ని వైఎస్సార్ సీపీ చూస్తూ ఊరుకోదు. తప్పకుండా బదులిస్తుంది. సోషల్ మీడియా కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది. వైఎస్సార్ సీపీ హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాల అనేక ప్రయోజనాలు చేకూర్చాం. కానీ చంద్రబాబు మోసపూరిత హామీలిచ్చి మోసం చేశారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సుపరిపాలనను ఐదు నెలల్లోనే నాశనం చేశారు. చంద్రబాబు పరిపాలన చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు. 2027లో మళ్లీ నూటికి నూరు శాతం వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుంది.

చంద్రబాబు మూర్ఖుడా? అసమర్థుడా..?

రుషికొండపై నిర్మించిన అద్భుతమైన భవనాలను ఎలా ఉపయోగించుకోవాలో తెలియడం లేదంటున్న చంద్రబాబు మూర్ఖుడా.. అసమర్థుడా.. ఏమనుకోవాలో అర్థం కావడం లేదు. అవి రాష్ట్రానికి తలమానికమైనవి. వాటిని ఎలా ఉపయోగించాలో అర్థం కాకపోతే ప్రొఫెషనల్స్ లేదా కన్సల్టెన్సీకి ఇస్తే వారే మంచి సలహా ఇస్తారు.

ద్వితీయ శ్రేణి పౌరుడిగా పవన్ కల్యాణ్

జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వంలో ఒక ద్వితీయ శ్రేణి పౌరుడిగా చూస్తున్నారు. అధికారంలోకి రాక ముందు లోకేష్.. పవన్‌కు పాదాభివందనం చేశాడు. ఇప్పుడు పవన్ ఆదేశాలు పాటించవద్దని అధికారులకు ఆదేశాలిస్తున్నాడంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఒక ప్రణాళిక ప్రకారం నెల నెలా కాపు సామాజికవర్గాన్ని, పవన్ కల్యాణ్‌ను అణగదొక్కుతున్నారు. చంద్రబాబును కలిసిన ఒక గంట తరువాత మందకృష్ణ మాదిగ బయటికొచ్చి పవన్‌ను విమర్శించారంటే చంద్రబాబు మార్కు రాజకీయాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇది ఆరంభం మాత్రమే. భవిష్యత్తులో పవన్ కల్యాణే తెలుసుకుంటారు. పవన్‌ను కూటమిలో కొనసాగే అవకాశం లేకుండా చేస్తారు. ఆయన ఉంటే లోకేష్ ముఖ్యమంత్రి అవడానికి అడ్డంకులు వస్తాయని భావిస్తున్నారు. రాష్ట్రంలో 20 శాతానికి పైగా కాపులు ఉన్నారు. అటువంటి పెద్ద సామాజిక వర్గాన్ని ఏరోజైనా ఎదుర్కోవాలంటే కష్టం. అందుకే ఒక ప్రణాళికా బద్ధంగా కాపులను, జనసేనను అణిచి వేసే కార్యక్రమం చేస్తున్నారు.

కచ్చితంగా వన్ నేషన్-వన్ ఎలక్షన్

కేంద్రంలో వివిధ నాయకులతో సత్సంబంధాలు ఉన్న నేతగా చెబుతున్నా.. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ జరగబోతోంది. దీంతో పాటు మహిళా రిజర్వేషన్ వచ్చి తీరుతుంది. డీలిమిటేషన్ జరిగి రాష్ట్ర శాసనసభలో ఎమ్మెల్యేల సంఖ్య, పార్లమెంట్‌లోని ఎంపీల సంఖ్య పెరుగుతుంది. ఈ మూడు తప్పకుండా జరిగి తీరుతాయన్నది నా అంచనా.

సగం నొక్కేశారు?

- పేకాటరాయుళ్ల వద్ద పట్టుకున్నది రూ. 24 లక్షలు... చూపించింది రూ.12 లక్షలే
- మిగిలింది పంచుకున్న సీఐ, ఎస్‌ఐలు ?



సాక్షి, అనకాపల్లి: ఇటీవల జూదం శిబిరంపై దాడి చేసిన సమయంలో పట్టుకున్న డబ్బులో సగం మాత్రమే చూపించి, మిగతా సగం పోలీసులు నొక్కేసినట్టు తెలిసింది. నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధిలోని ఒక పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఈ వ్యవహారంపై పోలీసు వర్గాల్లో అంతర్గతంగా చర్చ జరుగుతున్నట్టు సమాచారం. దీపావళికి ముందు పోలీసులు జరిపిన దాడుల్లో పేకాటరాయుళ్ల నుంచి రూ. 24 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఇందులో రూ.12 లక్షలు నొక్కేసి, మిగతా సొమ్ము అధికారికంగా చూపినట్టు భోగట్టా. తమ వద్ద మొత్తం రూ. 24 లక్షలు స్వాధీనం చేసుకున్నారు కదా, మరి ఇంత తక్కువ ఎందుకు చూపించారని పేకాటరాయుళ్లు పోలీసులతో వాగ్వాదానికి దిగినట్టు సమాచారం. దీంతో ఆగ్రహించిన పోలీసులు వారికి తమ స్టయిల్‌లో కోటింగ్ ఇచ్చినట్టు చర్చ జరుగుతోంది.

అమాసకు ముందే అవినీతి బాగోతం

ఇప్పటికే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ సీఐతో పాటు మరో ఎస్‌ఐ ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించినట్టు తెలుస్తోంది. కాజేసిన మొత్తంలో 70 శాతం సీఐకి.. 30 శాతం ఎస్‌ఐ పంచుకున్నట్టు సమాచారం. దీపావళి అమావాస్యకు ముందే దొరికిన ఈ మొత్తంతో వారికి ముందుగానే పండగ వచ్చినట్టు ఆ శాఖలోనే ఇతర పోలీసులు వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. అంతేకాకుండా సదరు సీఐ... ప్రతి స్టేషన్ నుంచి నెలవారీ మామ్ముళ్లను కూడా ప్రారంభించారన్న చర్చ జరుగుతోంది. పేకాటరాయుళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న మొత్తానికి... చూపించిన సొమ్ముకు మధ్య భారీ వ్యత్యాసం ఉందని, ఉన్నతాధికారులతో విచారణ జరిపితే మరిన్ని అవినీతి భాగోతాలు బయటకు వస్తాయన్న అభిప్రాయం ఆ శాఖలోనే వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

కొలిక్కిరాని అభిజిత్ కార్మికుల సమస్య



నిరసన తెలుపుతున్న అభిజిత్ కార్మికులు, సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం: స్థానిక సెజ్‌లోని అభిజిత్ పరిశ్రమ కార్మికుల సమస్య ఇంకా కొలిక్కి రాలేదు. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమై లే ఆఫ్‌ను ఎత్తివేస్తున్నట్టు ప్రకటించనప్పటికీ బుధవారం అటువంటి ఛాయలు కనిపించలేదు. కంపెనీ యాజమాన్యం లే ఆఫ్‌ను ఎత్తివేయలేదంటూ బుధవారం అభిజిత్ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. 25 రోజులుగా రోడ్లపై తిరుగుతూ ఉపాధి కోల్పోయిన కార్మికులకు న్యాయం చేసే విషయంలో ప్రభుత్వం చొరవ చూపకపోవడం దారుణమని ఐటీయూ నాయకులు కోటేశ్వరరావు, రొంగళి రాము, గనిసెట్టి సత్యనారాయణ, కూండ్రపు సోమునాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాలు చెల్లించి, కర్మాగారాన్ని తెరవాలని వారు డిమాండ్ చేశారు.

జీడి మామిడి తోటలకు స్వచ్ఛంద బీమా పథకం



నర్సీపట్నం డివిజన్ ఉద్యాన శాఖాధికారి శిరీషారాణి

రోలుగుంట: జీడి మామిడి తోటలకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో స్వచ్ఛంద బీమా పథకం అమలు చేస్తున్నట్టు నర్సీపట్నం డివిజన్ ఉద్యానవన శాఖాధికారి శిరీషారాణి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైతులు ప్రథమంగా ఎకరాకు రూ.1540 ప్రీమియం చెల్లించాలన్నారు. ఒక ఎకరా బీమా హామీ మొత్తం విలువ రూ.30,800 ఉంటుందన్నారు. పంట రుణం తీసుకోని రైతులు ఈ బీమాను కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), స్థానిక బ్యాంకుల్లో చెల్లించాలన్నారు. బ్యాంకు ద్వారా పంట రుణం తీసుకున్న రైతులు నేరుగా బ్యాంకు సిబ్బందిని సంప్రదించాలన్నారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 15వ తేదీలోగా బీమా ప్రీమియంను చెల్లించాలని ఆమె కోరారు.

చిట్టపులి జీవన.. స్వగ్రామం మారుమూల కిలగాడ. సాధారణ కుటుంబానికి చెందిన ఈమెను పట్టుదల.. సంకల్పం ఉన్నతస్థాయికి చేర్చాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాడేరు ఐటీడీఏ అందించిన సివిల్స్ శిక్షణను సద్వినియోగం చేసుకున్న జీవన 2023లో గ్రూప్–1కు ఎంపికై అనంతపురం పోలీసు అకాడమిలో శిక్షణ పూర్తి చేసుకుంది. విశేష ప్రతిభ కనబరిచి బెస్ట్ అవుట్‌డోర్, బెస్ట్ ఆల్‌రౌండర్, బెస్ట్ ఫైరింగ్ ట్రోఫీలను సాధించింది. త్వరలో డీఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్న ఆమె బుధవారం 'సాక్షి'తో మాట్లాడారు.



పోలీసు అకాడమి శిక్షణలో సాధించిన ట్రోఫీలతో చిట్టపులి జీవన

గిరిజన ముద్దుబిడ్డకు హ్యాట్రిక్

అనంతపురం పోలీసు అకాడమీ శిక్షణలో విశేష ప్రతిభ

- మెరిసిన గిరి యువతి జీవన
- ఆల్‌రౌండర్‌గా పతకాలు కైవసం
- తల్లిదండ్రుల ఆశయసాధనే లక్ష్యం
- త్వరలోనే డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్న చదువులతల్లి



శిక్షణ సమయంలో సహచరులతో జీవన



కుటుంబ సభ్యులతో చిట్టపులి జీవన

ముంచంగిపుట్టు: ఆ యువతి గిరిజన బిడ్డ.. తండ్రి టీచర్, తల్లి ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్నారు. ఆమె చదువుకు అవసరమైన సహకారం అందించారు. తన అభ్యున్నతి కోసం వారు పడుతున్న కష్టాలను చిన్నప్పటి నుంచి కళ్లారా చూసిన భావన వారి ఆశయ సాధనే లక్ష్యంగా చదివింది.

● కిలగాడ గ్రామానికి చెందిన చిట్టపులి జీవన తండ్రి రాజుపడాల్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తల్లి రమా పెదబయలు మండల కేంద్రంలో ఫ్యాన్సీ షాప్ నిర్వహిస్తున్నారు. చిన్నప్పటి నుంచి జీవన బాగా చదువుతుండటంతో పూర్తి సహకారం అందించి ప్రోత్సహించారు.

రెండు సార్లు ఎంసెట్ తప్పినా..: డాక్టర్ కావాలి అనే లక్ష్యంతో జీవన పట్టుదలతో చదివింది. అదే లక్ష్యంతో రెండు సార్లు ఎంసెట్ రాసినా ఫలితం దక్కలేదు. అయినా ఏమాత్రం నిరుత్సాహ పడలేదు. డాక్టర్ కావాలన్న ప్రయత్నాన్ని విరమించింది. గ్రూప్స్ వైపు దృష్టి పెట్టింది. ప్రైవేట్‌గా శిక్షణ పొందింది. ఆ తరువాత సివిల్స్ పరీక్షలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేపగుంట యూత్ శిక్షణ కేంద్రంలో పాడేరు ఐటీడీఏ అందించిన శిక్షణను ఆమె సద్వినియోగం చేసుకుంది. ఏపీ పబ్లిక్ సర్వీసు కమిషన్ నిర్వహించిన గ్రూప్స్ పరీక్ష రాసి సత్తా చాటి డీఎస్పీగా ఎంపికైంది. శిక్షణ పూర్తిచేసుకున్న ఆమె త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

డీఎస్పీగా మొట్టమొదటి గిరిజన యువతి

జిల్లాలో డీఎస్పీగా కొలువు సాధించిన మొట్టమొదటి గిరిజన యువతిగా భావన గుర్తింపు పొందారు. అనంతపురం పోలీసు అకాడమీ శిక్షణలో కూడా ఆమె ప్రతిభ కనబరిచారు. బెస్ట్ అవుట్‌డోర్, బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ట్రోఫీలు, పతకాలు అందుకున్నారు. వీటితో పాటు బెస్ట్ ఫైరింగ్‌లో సీఎం రివాల్వర్‌ను దక్కించుకున్నారు. శిక్షణ సమయంలో ఆమె కనబరుస్తున్న విశేష ప్రతిభకు ప్రశంసలు వెల్లువెత్తాయి.

చదువుతోనే తలరాతల మార్పు

ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన తమ ప్రాంతానికి న్యాయపరమైన సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తానని జీవన పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రోత్సాహంతోనే డీఎస్పీ స్థాయికి చేరుకోగలిగానని చెప్పారు. చదువుతోనే తలరాతలు మారుతాయన్న ఆమె శిక్షణ కాలంలో ప్రతిభకు పొందిన పతకాలను కుటుంబ సభ్యుల సమక్షంలో అందుకోవడం ఎన్నటికీ మరువలేనని పేర్కొన్నారు. లక్ష్యంతో చదివితే తప్పనిసరిగా ఉన్నతశిఖరాలు అధిరోహించగలమని, గిరిజన విద్యార్థులు ప్రతిఒక్కరూ ఈ దిశగా ప్రయత్నించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

విద్యార్థినులతో వెట్టిచాకిరీ

- యలమంచిలి బాలికోన్నత పాఠశాల బాలికలతో స్కూల్‌ను శుభ్రం చేయిస్తున్న టీచర్లు, హెచ్‌ఎం
- రోజుకు ఐదుగురికి చొప్పున బాధ్యతలు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్



యలమంచిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తరగతి గదులు, వరండాలను చీపురుతో ఊడ్చుతున్న 7వ తరగతి విద్యార్థిని

యలమంచిలి రూరల్: తరగతి గదుల్లో పెన్ను, పుస్తకం పట్టుకోవల్సిన చిట్టి చేతులు చీపుళ్లు పట్టుకుని, వెట్టి చాకిరీ చేయాల్సివస్తోంది. బాలికలు తరగతి గదులు, వరండాలు ఊడ్చుతుంటే ఈ పని చేయాల్సిన స్వీపరు చూస్తూ ఉండడం గమనార్హం. పోనీ ఏదో ఒక్కరోజే కదా? పిల్లలు శ్రమదానం చేశారనుకుంటే పొరపాటే. టీచర్లు ఒక టైం టేబుల్ వేసి మరీ బాలికలతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారు. యలమంచిలి తులసీనగర్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రోజూ పాఠశాల పనివేళలు ముగిసిన తరువాత బాలికలు చీపుళ్లు, పారిశుధ్య సామగ్రితో పనులు చేస్తున్నారు. రోజుకు ఐదుగురు బాలికలకు చొప్పున ఈ పనులు పురమాయించారు. బుధవారం సాయంత్రం ఏడో తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు తరగతి గదులు, వరండాలను చీపుళ్లతో శుభ్రం చేస్తూ కనిపించారు. పక్కనే ఉన్న పాఠశాల స్వీపర్ ఇదంతా చూస్తూ ఉండడం గమనార్హం. ఇదేమని ఆమెను ప్రశ్నించగా, తరగతి గదులన్నీ తాను ఒక్కదాన్నే ఊడ్చలేకపోతున్నానని చెప్పింది. అన్ని తరగతులను ఊడ్చే బాధ్యత విద్యార్థినులకు అప్పగించినట్టు బాలికలు 'సాక్షి'కి చెప్పారు. బాలల హక్కులు పరిరక్షించాల్సిన హెచ్‌ఎం, టీచర్లే వారితో వెట్టిచాకిరీ చేయించడాన్ని పలువురు ఆక్షేపిస్తున్నారు. బాలికలతో వెట్టి చాకిరీ చేయిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమణ, పలు విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు.

చర్యలు తీసుకుంటాం

పాఠశాల పనివేళలు ముగిసిన తర్వాత బాలికలను తరగతి గదులు ఊడ్చడానికి ఉపయోగించడం పూర్తిగా తప్పు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– వై.అప్పారావు, ఉపవిద్యాశాఖాధికారి, యలమంచిలి

సత్యం మాస్టారుకు అంతిమ వీడ్కోలు

- అధికార లాంఛనాలతో మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ అంత్యక్రియలు
- నివాళులర్పించిన పలువురు నాయకులు, అధికారులు



పెదగోగాడలో రెడ్డి సత్యనారాయణ అంత్యక్రియల సందర్భంగా గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

చీడికాడ: మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ(సత్యం మాస్టారు) అంత్యక్రియలను పెదగోగాడలో బుధవారం అధికార లాంఛనాలతో నిర్వహించి, కన్నీటి వీడ్కోలు పలికారు. అన్ని పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు సత్యం మాస్టారు భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒక సారి మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన రెడ్డి సత్యనారాయణ మంగళవారం తెల్లవారుజామున స్వగ్రామం చీడికాడ మండలం పెదగోగాడలో మృతి చెందారు. పెదగోగాడ శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. సత్యనారాయణ కుమారుడు రాము తలకొరివి పెట్టారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ, అనకాపల్లి డీఎస్పీ శ్రావణి ఆధ్వర్యంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు సతీమణి రమణమ్మ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే బుద్ద నాగజగదీశ్వరావుతో పాటు నియోజకవర్గ పరిధిలో గల వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొని అశ్రునయనాలతో తుది వీడ్కోలు పలికారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన అవసరం

- విశాఖ సీఐడీ అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్



మాట్లాడుతున్న ఎస్పీ ప్రేమ్‌కాజల్

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని విశాఖ సీఐడీ అదనపు ఎస్పీ డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్ సూచించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌పై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అభ్యున్నతి దిశగా ప్రభుత్వం సీఐడీలో పీపీఆర్ విభాగం ఏర్పాటు చేసిందన్నారు. షెడ్యూల్ కులాల కేసులను త్వరితగతిన విచారణ చేపట్టడానికి హైకోర్టు ఆదేశాలు మేరకు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సెల్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నెల 30వ తేదీన పౌర హక్కుల దినోత్సవాన్ని పాటించాలని ఆమె కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ సమయంలో రెవెన్యూపరంగా తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలను చిన్న చూపుతో చూస్తున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులను, కోర్టు సిబ్బందిని అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ఎ.వరబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.వి.ఎస్.కుమార్, డీవీఎంసీ జిల్లా మెంబర్లు మరియమ్మ, ఎం.అప్పలరాజు, విశాఖ, అనకాపల్లి సీఐడీ డీఎస్పీలు ఎం.నాగేంద్ర భూపాల్, కె.కుమార్ స్వామి, సీఐడీ విభాగం సీఐలు, ఎస్‌ఐలు, అనకాపల్లి పట్టణ, ట్రాఫిక్ సీఐలు టి.వి.విజయకుమార్, ఎం.వెంకటనారాయణ, ఆదిత్య, హిమశేఖర్, డీవీఎస్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

జలాశయాల్లో లైసెన్స్ వేటదారులకే అవకాశం

- ప్రైవేటు వ్యక్తులు చేప పిల్లలు పెంచితే కఠిన చర్యలు
- జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాద్ హెచ్చరిక
- రైవాడ జలాశయంలో 4 లక్షల చేప పిల్లల విడుదల



రైవాడ జలాశయంలో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎంపీపీ బుల్లి లక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ చల్లా లక్ష్మి



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖ అధికారి పి.ప్రసాద్

దేవరాపల్లి: జలాశయాల్లో లైసెన్స్ తీసుకున్న వేటదారులకే చేపల వేటకు అవకాశం ఉంటుందని, ప్రైవేటు వ్యక్తులు చేప, రొయ్యి పిల్లలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మత్స్యశాఖ అధికారి(డీఎఫ్‌వో) పి.ప్రసాద్ హెచ్చరించారు. రైవాడ జలాశయంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, స్థానిక సర్పంచ్ చల్లా లక్ష్మి, వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవానీతో కలిసి బుధవారం 4 లక్షల చేప పిల్లలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రైవేటు వ్యక్తి ఇటీవల జలాశయంలో రాత్రి పూట అక్రమంగా రొయ్యి పిల్లలను విడుదల చేశారని స్థానికులు కొందరు డీఎఫ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ జలాశయాల్లో లైసెన్స్ వేటదారులు తప్పా ప్రైవేటు వ్యక్తులు ఎవరూ ఎటువంటి కార్యకలాపాలు చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఆరు నెలల తర్వాత లైసెన్స్ పొందిన వేటదారులంతా వేట చేసుకోవచ్చునని సూచించారు.

జిల్లాలో 30 లక్షల చేప పిల్లల పెంపకమే లక్ష్యం

జిల్లాలోని రైవాడ, తాండవ, పెద్దేరు, కోనాం జలాశయాలు సహా మత్స్యశాఖ సహకార సంఘం పరిధిలోని 60 చెరువుల్లో 30 లక్షల చేప పిల్లల పెంపకమే లక్ష్యంగా నిర్దేశించుకున్నామని డీఎఫ్‌వో ప్రసాద్ తెలిపారు. జిల్లా నుంచి ఏటా 30 వేల టన్నుల చేపలు ఉత్పత్తి అవుతున్నాయని, వీటిలో 70 శాతం మేర ఎగుమతి చేస్తున్నామన్నారు. పెద్దేరు జలాశయంలో పంజరాలలో చేపల పెంపకాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపడుతున్నట్టు చెప్పారు. ఆశించిన స్థాయిలో ఫలితాలు వస్తే అన్ని జలాశయాల్లో ఈ విధానంలో చేపల పెంపకం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి, నర్సీపట్నం ఇన్‌చార్జి ఎఫ్‌డీవో టి.నాగమణి, సర్పంచ్‌లు చింతల సత్య వెంకటరమణ, గంధం రామకృష్ణ, ఎంపీటీసీలు వంటాకు పైడితల్లమ్మ, బండి గౌరమ్మ, చల్లా తాతయ్యలు, చల్లా నానాజీ, చల్లా నాయుడు, స్థానిక మత్స్యశాఖ అధికారి కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్, ఎలక్ట్రీషియన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నేక్), రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి కౌశల్ యోజన 4.0 పథకంలో భాగంగా ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి కోసం నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి అర్హతతో ఎలక్ట్రీషియన్ శిక్షణకు 15 నుంచి 45 ఏళ్ల వయస్సు, ఇంటర్ అర్హతతో సర్వేయర్ శిక్షణకు 15 నుంచి 45 ఏళ్ల వయస్సు గల అభ్యర్థులకు మూడు నెలల పాటు మాకవరపాలెం నేక్ శిక్షణ కేంద్రంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తిగా నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో జరుగుతుందన్నారు. పూర్తి సమాచారం కోసం ఫోన్ నంబర్లు 77803 74625, 77802 75922లలో సంప్రదించాలన్నారు.

పీఎంఏవై ఇళ్ల నిర్మాణాలకు ఆటంకాలు కలిగించొద్దు

- స్థానికులతో విశాఖ జిల్లా కలెక్టర్



ప్రజలతో మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

పరవాడ: పెదముషిడివాడలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) పథకంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలకు ఎలాంటి ఆటంకాలు కలిగించవద్దని స్థానికులను విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం ఆయన హౌసింగ్ లేఅవుట్‌ను సందర్శించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులకు స్థానికుల నుంచి ఎదురవుతున్న ఆటంకాల నేపథ్యంలో ఆయన లే అవుట్ వద్ద పరిస్థితుల్ని స్వయంగా పరిశీలించారు. ఆటంకాలకు గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్ ఏర్పాటుకు భూసేకరణ జరిపి, బదులుగా తమకు వేరే చోట కేటాయించిన స్థలానికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందించలేదని వారు కలెక్టర్‌కు తెలిపారు. వెంటనే సమస్యపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌తో ఫోన్లో సంప్రదించి చర్చించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాసరావు, పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, గృహ నిర్మాణ శాఖ అధికారులు ఉన్నారు.

ముగ్గురు గంజాయి నిందితులకు ఏడాది జైలు

చోడవరం రూరల్: గంజాయి అక్రమ రవాణా కేసులో నేరం రుజువు కావడంతో ముగ్గురు నిందితులకు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ బుధవారం 9వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.రత్నకుమార్ తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. ముంచింగిపుట్ మండలం హంసపాదుకు చెందిన వంతల సురేష్(50), జప్పార్ గ్రామానికి చెందిన శేషా సున్ను(56), ఒడిశా రాష్ట్రం చిత్రకొండ మండలం పూల్ పడవ గ్రామానికి చెందిన వంతల సుక్కు(35) 2013 అక్టోబరు 31న అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగిపుట్ మండలం లంబూరి జంక్షన్‌లో 10 కిలోల గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ మేరకు ముంచింగిపుట్ పోలీసులు కేసు నమోదు చేసి, చార్జిషీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను విచారించిన జిల్లా జడ్జి.. నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

కుమారుడిపై గొడ్డలితో దాడి



గాయాలతో రాజేష్

అనకాపల్లి: మాటా మాటా పెరిగి కుమారుడిపై తండ్రి గొడ్డలితో దాడి చేసిన ఘటన గోపాలపురం పంచాయతీ వెంకటరమణపేట గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ సత్యనారాయణ కథనం మేరకు.. ములుగు సూరి అప్పారావు, అతని కుమారుడు రాజేష్ తాపీ పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తుంటారు. రాజేష్ పనులకు వెళ్లడం లేదని, వివాహం జరిగిన తరువాత అతని కుటుంబాన్ని పోషించాలంటే కష్టంగా ఉందని సూరిఅప్పారావు కుమారుడిని మందలించాడు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య గొడవ జరగడంతో తండ్రి సూరిఅప్పారావు కొడుకు రాజేష్ ముఖంపై గొడ్డలితో దాడి చేశాడు. రాజేష్‌ను ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌లో చేర్చామని ఎస్‌ఐ తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫీజు బకాయిల కోసం విద్యార్థుల ఆందోళన



నెహ్రూచౌక్ వద్ద మానహారం నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

అనకాపల్లి: విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూచౌక్‌లో బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో విద్యార్థులు మానవహారం నిర్వహించి, ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం అమలు చేయకపోవడంతో చాలా మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాలేజీలు, ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు కట్టలేని విద్యార్థులను కాలేజీలు, స్కూళ్ల యాజమాన్యాలు ఇంటికి పంపేస్తున్నాయన్నారు. సర్టిఫికెట్లు ఇవ్వకుండా యాజమాన్యాలు ఇబ్బందులు పెడుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫీజు బకాయిలను విడుదల చేయాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.బాలాజీ, డివిజన్ కార్యదర్శి ఎస్.నాగరమణ, జిల్లా నాయకులు కృపానంద్, అర్జున్‌నాయుడు, తరుణ్, లక్ష్మణ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చేలా ఆర్టీసీ సేవలు



గ్యారేజ్ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి కె.పద్మావతి

నర్సీపట్నం: ప్రజలు మెచ్చేలా ఆర్టీసీ సేవలు అందించేందుకు గ్యారేజ్ సిబ్బంది, డ్రైవర్లు కృషి చేయాలని జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి కె.పద్మావతి అన్నారు. బుధవారం నర్సీపట్నం ఆర్టీసీ డిపోను ఆమె సందర్శించారు. డిపోలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. గ్యారేజ్ సూపర్‌వైజర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది అంకిత భావంతో పనిచేస్తే సంస్థకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. డ్రైవర్లు సంతోషకర వారోత్సవాల్లో భాగంగా బస్సుల కండీషన్‌ను మెరుగుపర్చాలన్నారు. ప్రతి నెలా మొదటి వారం 1, 2, 3 తేదీల్లో డ్రైవర్ల నుంచి బస్సుల్లో తలెత్తే సాంకేతిక లోపాలను తెలుసుకుని, 7వ తేదీలోపు సరి చేసి, వాటి వివరాలను డ్రైవర్లకు తెలియజేయాలన్నారు. తద్వారా డ్రైవర్లలో ఆత్మవిశ్వాసం పెరిగి, మరింత అంకిత భావంతో పని చేస్తారని ఆమె చెప్పారు. గ్యారేజ్ సిబ్బందికి స్పేర్ పార్టులను సప్లై చేస్తామన్నారు. ఈ సమావేశంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ పి.ఆచారి, ట్రాఫిక్ ఇన్‌చార్జి ఎం.ఎస్.మోహన్‌రావు, అనకాపల్లి అసిస్టెంట్ ఇంజినీర్ మల్లేశ్వరరావు, ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ రవిచంద్ర, గ్యారేజ్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు డి–1 సెక్షన్ పరిధిలో ఈనెల 8 ఉదయం 7 నుంచి 2 గంటల వరకూ విద్యుత్ వైర్ల మరమ్మతు నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే స్టేషన్, తాకాశివీధి, మళ్లవీధి, కోట్ని వీధి, గాంధీబొమ్మ సెంటర్, చిన్నవీధి, పెరుగు బజార్ జంక్షన్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

చెరకాం గ్రామ సభకు 137 అర్జీలు


రెవెన్యూ గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

కశింకోట: మండలంలోని చెరకాంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు 137 అర్జీలు వచ్చాయి. భూముల హెచ్చుతగ్గులు సవరించాలని, పంపకాలు చేసి పాస్ పుస్తకాలు ఇవ్వాలని, రీసర్వేలో తప్పులను సరి చేయాలని తదితర భూ సమస్యలను రైతులు సభ దృష్టికి తెచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు బదులిచ్చారు. కార్యక్రమంలో రీసర్వే ఉప తహసీల్దార్ భాస్కరరావు, మండల సర్వేయర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

'ముఖ ఆధారిత హాజరుతో ముడిపెట్టొద్దు'

కశింకోట: ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల జీతాలకు ముఖ ఆధారిత హాజరును ముడిపెట్టడం శోచనీయమని రాష్ట్ర తెలుగునాడు ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.వి.ప్రసాద్, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పాతాల రామారావు, కార్యదర్శి కె.ఎస్.ఆర్.కె.జి.నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ, రాష్ట్ర అధికారులు అత్యుత్సాహంతో ఏ ప్రభుత్వ శాఖలో లేని ముఖ ఆధారిత హాజరును జీతాలకు ముడిపెట్టి అనుసంధానించారన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు హాజరును పరిమితం చేశారని, దీనివల్ల ప్రజలకు అత్యవసర, నిరంతర వైద్య సేవలు దూరమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పునరాలోచించి ముఖ ఆధారిత హాజరు విధానాన్ని విరమించుకోవాలని వారు కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 997 దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	5,070
మొదటి రకం	3,620	4,670
రెండో రకం	3,440	4,120
మూడో రకం	3,010	3,430

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
'క'	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరన్	: సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	: పర్తిసాయి
బ్లడీ బెగ్గర్	: షిర్డిసాయి
బఘీర	: వెంకటేశ్వర
విశ్వం	: శ్రీసత్య
లక్కీ భాస్కర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 394 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 341 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924–223595 నంబరులో సంప్రదించవచ్చు.

ఆయుర్వేదం.. ఆరోగ్య భాగ్యం

మండలంలోని కన్నూరుపాలెంలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి ప్రజల ఆదరాభిమానాలు పొందుతోంది. స్థానికులతో పాటు స్థానికేతరులను అధికంగా ఆకర్షిస్తోంది. సకాలంలో వైద్య సేవలు అందుతుండటంతో పాటు వ్యాధులు నయం కావడంతో ఆస్పత్రి పట్ల ఆదరణ చూపుతున్నారు. ఆయుష్మాన్ భారత్ తరపున నడుపుతున్న కన్నూరుపాలెం ఆయుర్వేదిక్ ఆస్పత్రికి వందేళ్ల చరిత్ర ఉంది.


కన్నూరుపాలెంలో ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి

- చక్కటి సేవలందిస్తున్న కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి
- దూరప్రాంతాల నుంచి కూడా రోగుల రాక
- వేగంగా ఉపశమనం లభిస్తుందని కితాబు

కశింకోట: ఆయుర్వేద వైద్యంపై సరైన అవగాహన లేకపోవడంతో గతంలో కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రికి రోగులు అంతంత మాత్రంగానే వచ్చేవారు. దీన్ని మూడున్నర లక్షలతో ఆధునికీకరించారు. సదుపాయాలు కల్పించి ఆస్పత్రి భవనాన్ని తీర్చిదిద్దారు. వైద్య సేవలను మెరుగుపరిచారు. ప్రస్తుత వైద్యురాలు టి.శిరీష కూడా అంకితభావంతో పని చేస్తూ వైద్య సేవలందిస్తున్నారు. సమర్థవంతంగా వ్యాధి నిర్ధారణ చేసి అందుకు అనువైన మందులను ఉచితంగా అందిస్తున్నారు. దీంతో వాటిని వినియోగిస్తున్న రోగుల వ్యాధులు క్రమంగా నయం అవుతున్నాయి. స్థానికుల కంటే


సేవలు అందిస్తున్న వైద్యాధికారి శిరీష

స్థానికేతరులు ఎక్కువగా ఆకర్షితులై వైద్య సేవలు వినియోగించుకుంటున్నారు. మండల ప్రజలతో పాటు నర్సీపట్నం, మాకవరపాలెం, కోటవురట్ల, రోలుగుంట, కొత్తకోట తదితర ప్రాంతాల నుంచి రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. గతంలో తక్కువగా ఉన్న రోగుల సంఖ్య ఇప్పుడు 40కి చేరుకుంది. దీంతో స్థానికులు కూడా క్రమేపీ ఆయుర్వేద వైద్య సేవలను వినియోగించుకుంటున్నారు. దీంతో ఆస్పత్రికి ఆదరణ పెరుగుతోంది. ఆస్పత్రి ఆవరణలో ఔషధ మొక్కల పెంపకం చేపట్టారు. చుట్టు పక్కల ఉన్న మొక్కల్లో ఉన్న ఔషధ గుణాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కోసం తిప్పతీగ, రావి, ఉసిరి, నల్లేరు, తులసి, వాము ఆకు, వేప, మారేడు, వావిలి, రణపాల, తమలపాకు వగైరా ఔషధ గుణాలున్న మొక్కలు పెంచి సంరక్షిస్తున్నారు.

యోగా షెడ్ నిర్మించాల్సి ఉంది..

ఆస్పత్రి ద్వారా నియమించిన ఇద్దరు యోగా ఉపాధ్యాయులు ఆరోగ్యానికి ఉపకరించే యోగా పట్ల విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో అంతా యోగా పట్ల ఆకర్షితులవుతున్నారు. అయితే ఆస్పత్రిలో యోగా బోధనకు తగిన వసతి సదుపాయం లేదు. దీన్ని కల్పించాల్సి ఉంది. ఇందుకు ప్రత్యేకంగా ఆస్పత్రి ఆవరణలో షెడ్డు నిర్మించాల్సి ఉంది. నిధుల లేమి వల్ల అందుకు అవకాశం లేని పరిస్థితి. దీని దృష్ట్యా ప్రజా ప్రతినిధులు గాని, దాతలు గాని ముందుకు వచ్చి యోగా షెడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

మందులు బాగా పనిచేస్తున్నాయి



ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో శరీర, మోకాళ్ల నొప్పులకు మందులు వాడుతున్నాను. అవి బాగానే పని చేస్తున్నాయి. నొప్పుల నుంచి ఉపశమనం పొందుతున్నాం. ఆనందంగా ఉంది. ఆయుర్వేద ఆస్పత్రి సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– చీపురుపల్లి ముత్యాలు, కన్నూరుపాలెం

దూరమైనా ఇక్కడికే వస్తున్నాం



వైద్య సేవలు బాగున్నాయని తెలియడంతో దూరం అయినా ఛార్జీలు పెట్టుకుని కన్నూరుపాలెం ఆయుర్వేద ఆస్పత్రికి వచ్చి సేవలు వినియోగించుకుంటున్నాం. ఉచితంగా మందులు అందిస్తుండటం, వ్యాధులు నయం అవుతుండటం ఆనందంగా ఉంది.

– గట్ట చిట్టెమ్మ, కొత్తకోట, రోలుగుంట మండలం

అన్ని రకాల వ్యాధులకు మందులిస్తున్నాం

ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో రోగుల సంఖ్య పెరిగింది. నర్సీపట్నం, కోటవురట్ల, కొత్తకోట, మాకవరపాలెం తదితర గ్రామాల నుంచి ఎక్కువగా రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. దాదాపు అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నాయి. గతంలో కంటే ఇప్పుడు స్థానికులు కూడా ఆస్పత్రి సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

– టి. శిరీష, వైద్యాధికారి, ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి, కన్నూరుపాలెం.

శిలాఫలకానికి మోక్షమెప్పుడు?

- ఎన్నికల కోడ్ సందర్భంగా మూసేసిన అధికారులు
- పేర్లు కనిపించకుండా వేసిన తెలుపు రంగు తొలగించని వైనం


రేబాక రైతు భరోసా కేంద్రంలో తెలుపు రంగుతో మూసివేసిన శిలాఫలకం

తుమ్మపాల: ఎన్నికలు పూర్తయి ఐదు నెలలు కావస్తున్నా అధికారులు మాత్రం కళ్లు తెరవలేదు. ఎన్నికల నిబంధనల మేరకు రాజకీయ నాయకుల పేర్లు, చిత్రాలు, విగ్రహాలపై ముసుగులు వేసి కోడ్ ముగిసిన వెంటనే తొలగించడం అధికారుల విధుల్లో భాగం. కాని అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు మండలంలో రేబాక గ్రామ సచివాలయ సిబ్బంది. ఎన్నికలకు ముందు అంటే ఏప్రిల్‌లో మూసివేసిన శిలాఫలకాన్ని నేటికీ తెరవలేదు. గ్రామంలో రైతాంగానికి అందుబాటులో ఉండేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాదాపు రూ.22 లక్షలు ఖర్చు చేసి నూతన రైతు భరోసా భవనాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు అప్పటి ప్రభుత్వ పాలకుల పేర్లతో ఏర్పాటు చేసిన శిలాఫలకంపై సచివాలయ సిబ్బంది తెలుపు రంగు పెయింట్ వేసి పేర్లు మూసేశారు. అదే భవనంపై మాజీ సీఎం జగన్ చిత్రపటాన్ని ఎన్నికల అనంతరం ఇనుప పనిముట్లతో ధ్వంసం చేసి తొలగించారు. శిలాఫలకాన్ని తొలగించేందుకు అవకాశం లేకపోవడంతో మూసివేసిన రంగును తొలగించకుండా నేటికీ అలాగే ఉంచారు. రైతుల బాగోగుల కోసం ఏర్పాటు చేసిన ఆర్‌బీకే కావాలి కాని నిర్మించిన నాయకుల పేర్లు మాత్రం ఉండకూడదన్నట్లు కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందనడానికి ఇదే నిదర్శనం.

యోగ సాధనతో వ్యాధులు దూరం


మాట్లాడుతున్న యోగా గురువు రిత్ దేవ్‌జీ మహారాజ్

తుమ్మపాల: నిత్య యోగ సాధనతో వ్యాధులు దూరమవుతాయని ప్రముఖ యోగా గురువు రిత్ దేవ్‌జీ మహారాజ్ అన్నారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో ఈనెల 2 నుంచి ప్రారంభమైన యోగ శిక్షణ శిబిరం నేటితో ముగిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. యోగాసనాలు వేయడం వల్ల చక్కెర వ్యాధి దూరమవుతుందన్నారు. కాకరకాయ, కీరా, టమాటా జ్యూస్ తయారు చేసుకుని ఉదయాన్నే పరగడుపున ఒక గ్లాస్ తాగితే షుగర్ అదుపులో ఉంటుందన్నారు. బిశెట్టి దొరమ్మనాయుడు, మంగయ్య, జార్జి క్లబ్ అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు, కొలపర్తి కన్నబాబు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ముఖ్యం


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు


సర్వసభ్య సమావేశానికి హాజరైన సభ్యులు

- వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ పాటించాల్సిందే..
- ప్రభుత్వ కార్యక్రమాల్లో వారిని పక్కన పెట్టడం సరికాదు
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు


సమాచార హక్కు చట్టం గురించి వివరిస్తున్న మండల వ్యవసాయాధికారి స్వప్న

కశింకోట: మండల గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాల అమలులో వైఎస్సార్‌సీపీకి చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులకు ప్రొటోకాల్ పాటించడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. కశింకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షత వహించిన సభలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు మండలంలో అత్యధికంగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించకుండా వారిని అధికారులు పక్కన పెడుతున్నారని విమర్శించారు. ఇది సమంజసం కాదని, అధికారంలో ఎవరున్నా ప్రొటోకాల్ పాటించాల్సిందేనన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు వివక్షత లేకుండా ప్రొటోకాల్ పాటించామని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా ప్రొటోకాల్ పాటించాలని, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలించబోమని, తమ సహకారం అందిస్తామన్నారు. గ్రామాల అభివృద్ధి తమకు ముఖ్యమని, అధికారులు ప్రొటోకాల్ పాటించేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఎంపీడీవో వి.వి.రవి కుమార్ స్పందిస్తూ ప్రొటోకాల్ పాటిస్తున్నామని, దిగువ స్థాయి అధికారులకు కూడా ఈ విషయమై ఆదేశాలిచ్చి ప్రొటోకాల్ పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సమావేశంలో చర్చించిన అంశాలు

- ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, తేగాడ ఎంపీటీసీ సభ్యురాలు మంగతాయారు మాట్లాడుతూ వరద బాధితుల సహాయార్థం స్వయం సహాయక సంఘాల నుంచి విరాళాలు సేకరించి పంపారా.. అని ప్రశ్నించారు. దీనికి వెలుగు ఏపీఎం పార్వతి బదులిస్తూ ఈ విషయం తన దృష్టికి రాలేదని, దీనిపై విచారిస్తానన్నారు.
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ నిర్మించి పంటలకు సాగునీరు అందివ్వడానికి చర్యలు తీసుకోవాలని గున్నయ్యనాయుడు కోరగా.. పోలవరం అనకాపల్లి డివిజన్ డీఈ భాగ్యలక్ష్మి బదులిస్తూ వచ్చే ఏడాదికి పనులు పూర్తి చేసి అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.
- ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు.
- మండల సమావేశానికి తప్పనిసరిగా ఆయా శాఖల అధికారులు హాజరై సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేకుంటే వారిపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు.
- ఉద్యానవనాల శాఖాధికారి లావణ్య మాట్లాడుతూ జీడిమామిడి పంటలకు ప్రభుత్వం బీమా సదుపాయాన్ని కొత్తగా కల్పించిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.
- సమాచార హక్కు చట్టం గురించి మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న సభలో అవగాహన కలిగించారు. సమావేశంలో తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాలరావు, వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, అధికారులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

121 మద్యం బాటిళ్ల స్వాధీనం


మద్యం బాటిళ్లతో ఎస్ఐ సత్యనారాయణ, ఏఎస్ఐ భాస్కరరావు

అనకాపల్లి: మండలంలో తగరంపూడి గ్రామానికి చెందిన గల్లా వరహాలబాబు అక్రమంగా తరలిస్తున్న 121 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ సత్యనారాయణ బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు వరహాల బాబు ఇంటి వద్ద తనిఖీలు నిర్వహించామన్నారు. కేసు నమోదు చేసి వరహాల బాబును కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ చెప్పారు.

కోలాహలంగా గౌరీపరమేశ్వరుల ఊరేగింపు


ఊరేగింపులో పాల్గొన్న ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లిలో మంగళవారం రాత్రి గౌరీపరమేశ్వరులను ప్రతిష్ఠించారు. ప్రతి ఏటా మాదిరిగా నాగులచవితి నాడు గ్రామంలో గౌరీపరమేశ్వర్లను నెలకొల్పి నెల రోజు పాటు భక్తి శ్రద్ధలతో పూజలు జరిపి, పౌర్ణమి తర్వాత నిమజ్జనం చేస్తారు. ఈ నేపథ్యంలో గౌరీపరమేశ్వర విగ్రహ ఊరేగింపు కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళల కోలాట ప్రదర్శనలు, ఆధ్యాత్మిక భజనలు, మేళతాళాల నడుమ ఊరేగింపు సాగింది. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో గౌరీ పరమేశ్వర్లను ప్రతిష్ఠించారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు సంఘీభావం


మలసాల భరత్‌కుమార్ తదితర నాయకులు, శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

కశింకోట: నర్సీపట్నం రూరల్ సీఐ నిరంకుశ ధోరణికి వ్యతిరేకంగా ఉద్యమించి అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌తో పాటు నలుగుర్ని బుధవారం కశింకోట స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఉదయం 11.30 గంటల నుంచి ఇక్కడి పోలీసుల అదుపులో ఉన్న వీరిని సాయంత్రం విడుదల చేశారు. నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, అనకాపల్లి మండలాధ్యక్షుడు గొర్లి సూరిబాబు, పార్టీ అనకాపల్లి అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, యువజన విభాగం కార్యదర్శి జాజుల రమేష్, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, యువ నాయకుడు మలసాల కుమార్‌రాజా, నర్సీపట్నానికి చెందిన పలువురు పార్టీ నాయకులు తదితరులు వీరిని కలిసి సంఘీభావం తెలిపారు.

ఘనంగా కుసుమ హరనాథ్ ఆలయ వార్షికోత్సవం


కుసుమ హరనాథ్‌ను దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్ తదితరులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం కోటవీధిలో కుసుమ హరనాథ్ మహాప్రభువుల 29వ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కుసుమ హరనాథ్ కమిటీ అధ్యక్షుడు శ్రీరామదాసు వరాహ సత్యనారాయణ మలసాల భరత్‌కుమార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, పార్టీ నాయకులు నడిశెట్టి మధు, శ్రీధరాల మనోజ్‌కుమార్, దొడ్డి హరి, రాపేటి మహాలక్ష్మినాయుడు, బుద్ద నర్సింగరావు, ఎం.శ్రీనివాసరావు, పీలా రాజు, కాండ్రేగుల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలపై వినతి


పీహెచ్‌సీ వైద్యురాలు నజరత్ సమీమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫణికుమార్

అనకాపల్లి: రాష్ట్రంలోని వైద్య విభాగం 104 వాహనంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ 104 ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి.ఆర్.ఫణికుమార్ కోరారు. మండలంలో తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు నజరత్ సమీమ్‌కు యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 సర్వీసును ప్రభుత్వం గతంలో మాదిరి నిర్వహించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, అతి తక్కువ నగదు కేవలం రూ.50 వేలతో ఈ సర్వీస్‌లను నిర్వహించవచ్చని, అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన 3 నెలలు వేతనాలు తక్షణమే చెల్లించాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈవోలకు ఉద్యోగ భద్రత కల్పించి జీవో నంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, 3 ఏళ్లుగా బకాయిపడ్డ ఇంక్రిమెంట్స్, ఏరియర్స్ రూపంలో చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐలను యాజమాన్యం వాటా యాజమాన్యం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, వాహనాల ఫిట్‌నెస్ ఇన్సూరెన్స్‌లు ప్రభుత్వంమే చెల్లించాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందించామని తెలిపారు. ఈ నెల 14 వరకూ తమ సమస్యలు పరిష్కరించాలని వివిధ రూపాల్లో ప్రజాప్రతినిధులు, ఎంపీడీవోలు, తహసీల్దారులకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో 104 సిబ్బంది గౌతమి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా రంగంలో ప్రోత్సాహకాలపై హర్షం

తుమ్మపాల: క్రీడా రంగానికి మరిన్ని ప్రోత్సాహకాలు ప్రకటించిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎండీ గిరీష, శాప్ చైర్మన్ రవినాయుడు తదితరులకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్వీ రమణ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల్లో స్పోర్ట్స్ కోట మూడు శాతానికి పెంపు, పతకాలు సాధించిన క్రీడాకారులకు రెట్టింపు నజరానాలు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. కడప, విజయవాడ, విజయనగరంలో క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో విజయనగరం క్రీడా పాఠశాల గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలో క్రీడా వికాస కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. ఏపీకి వరంగా సముద్ర తీరం, కొండలు, అడవులు ఉన్నాయని, మౌంటెయిన్ బైకింగ్, వాటర్ స్పోర్ట్స్ నేచర్ ఫొటోగ్రఫీ, ట్రెక్కింగ్ వంటివి ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రకటనతో అనేక మంది క్రీడాకారులు వెలుగులోకి వస్తారని అన్నారు.

నేడు అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం

అనకాపల్లి: జీవీఎంసీ జోన్–7 అనకాపల్లి పరిధి తుంపాల పంప్ హౌస్ నుంచి అనకాపల్లిలో వివిధ ప్రాంతాలకు సరఫరా చేసే పైపులైన్ లీక్ కారణంగా గురువారం అనకాపల్లి ప్రాంత ప్రజలకు తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని నీటి సరఫరా విభాగం కార్య నిర్వాహక ఇంజినీరు మురళీకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనకాపల్లి పరిధిలోని 6 రిజర్వాయర్లకు మంచినీరు అందించే 6 ఎంఎం సైజు గల పీఎస్‌పీ ప్రధాన పంపులైన్ లీక్ అయినందున మరమ్మతులు చేపట్టే విషయమై గురువారం అనకాపల్లి పరిసర ప్రాంతాలకు తాగునీటిలో అంతరాయం ఏర్పడనుందని ఆయన తెలిపారు. తాగునీటి సరఫరా అంతరాయానికి చింతిస్తూ జీవీఎంసీ కమిషనర్ తరపున నగర ప్రజలు సహకరించాలని కోరారు. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా అవసరమైన ప్రాంతాలకు నీటి సరఫరా చేయనున్నట్టు చెప్పారు. శుక్రవారం యథావిధిగా నీటి సరఫరా పునరుద్ధరించి సరఫరా చేయనున్నట్టు పేర్కొన్నారు.

వైభవంగా అయ్యప్ప అంబలం పూజ


అంబలం పూజ నిర్వహిస్తున్న మాలధారులు

తుమ్మపాల: ఆధ్యాత్మికతకు పేరొందిన శ్రీ గౌరీ పంచాయతన దేవస్థానంలోని అయ్యప్ప స్వామి దేవాలయ సన్నిధిలో బుధవారం సాయంత్రం వైభవంగా అంబలం పూజ నిర్వహించారు. కార్తీక మాసం మొదటి బుధవారం సందర్భంగా బంగారు బాబు అయ్యప్ప సిండికేట్ ఆధ్వర్యంలో ఊంజల్ సేవ, అంబలం పూజ, అభిషేకాలు చేపట్టారు. అనంత రం సద్ది కార్యక్రమం నిర్వహించారు. గురుస్వామి మద్దాల నారాయణరావు, పొందూరు సూర్యనారాయణ శాస్త్రి, పీలా నాని, కాండ్రేగుల శ్రీను (సోడా లు) గురుస్వాముల ఆధ్వర్యంలో 12 ఏళ్లుగా గౌరీ సేవా సంఘం అయ్యప్ప స్వామి దేవాలయంలో బంగారు బాబు సిండికేట్ నిర్వహిస్తున్న ఊంజల్ సేవ, అంబలం పూజ ఘనంగా జరిగింది. ఆ ప్రాంతమంతా అయ్యప్ప స్వామి నామస్మరణతో మార్మోగింది. అనంతరం పడి వెలిగించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గౌరీ సేవా సంఘం కమిటీ సభ్యులు, ప్రెసిడెంట్ కర్రి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

11న మృత్యుంజయ హోమం

అనకాపల్లి: మండలంలోని బట్లపూడి పంచాయతీ నాయుడుపేట సోహం ఆశ్రమంలో ఈ నెల 11న ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకుడు కాండ్రేగుల రవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్తీక మాసం రెండో సోమ వారాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. హోమంలో పాల్గొనే భక్తులు ముందుగా ఆశ్రమంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మధ్యాహ్నం ఆలయానికి వచ్చే భక్తుల కోసం అన్న సమారాధన జరుగుతుందన్నారు.